నాలుగో యూనిట్


# 18. అసామాన్యులు

**(ఉపవాచకం)**

ప్రతి రోజూ మనం ఎన్నో చూస్తూంటాం. వాటిలో కొన్నింటిని పట్టించుకోం. మరికొన్నింటిని గురించి ఆలోచించం. కానీ కొద్దిగా దృష్టి పెడితే కొన్ని విషయాలలో ఆశ్చర్యం వేస్తుంది. మర్రివిత్తనాన్ని చూశారా? ఎంత చిన్నగా ఉంటుంది! పరిశీలించి చూస్తే తప్ప గుర్తుపట్టలేనంతగా ఉంటుంది. కాని దీనిలో నుంచే పెద్ద మర్రిచెట్టు వస్తుంది. అంటే అంత చిన్న గింజలో ఇంత గొప్ప శక్తి ఉందన్నమాట. ఇలాగే మన మధ్యనే ఉన్నవాళ్ళలో కూడా ఏదో గొప్పతనముంటుంది. సామాన్యులుగా కనిపించేవాళ్ళలో కూడా అసామాన్యమైన ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని గుర్తించాలి. గౌరవించాలి.

"ఆకాశంలో హాయిగా ఎగరగలిగే విమానాన్ని ఎవరు కనుక్కొన్నారు? ప్రపంచంలోని విషయాలను క్షణాలలో ప్రత్యక్షంగా మనకు చూపించే టి.వి. ని కనిపెట్టిందెవరు? సమాచార వ్యవస్థలో సాంకేతిక విప్లవాన్ని తెచ్చిన సెల్‌ఫోన్ రూపశిల్పి ఎవరు?" అని తరచూ ప్రశ్నిస్తుంటాం. కాని ఈ సుఖాలు, విలాసాలకన్నా ముందు జీవిత అవసరాలను తీర్చుకొనే మార్గం చూపిన మహాపురుషుల గురించి ఎప్పుడైనా దృష్టి సారించామా? వాళ్ళ కృషిని, త్యాగాన్ని ఎన్నడైనా తలచుకొంటున్నామా?

"అన్నమయములైన వన్ని జీవమ్ములు - కూడులేక జీవకోటి లేదు." అన్నారు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారు. ఆహారం లేకుంటే ఏ ప్రాణీ బతకదు. ఇంత ప్రాధాన్యమున్న ఆహార విషయాలను గురించి మనకు మొదట తెలిపినవారు ఆదివాసులు. అడవులే అమ్మ ఒడిగా, కొండకోనలే తోడునీడగా జీవిస్తారు. వాళ్ళు రేయింబవళ్ళు ప్రకృతితోనే కలిసి ఉన్నారు. ప్రకృతిని బాగా పరిశీలిస్తారు. ఏవి తినాలో, ఏవి తినగూడదో చెప్పారు. అలా చెప్పడానికి వాళ్ళు ఎన్నో ప్రయోగాలు చేశారు. వాటిని రుచి చూశారు.



© SCERT not to be republished

ఈ ప్రయోగాలలో కొన్ని సందర్భాలలో కొందరు ప్రాణాలు కూడా వదిలారు. జంతువుల మాంసం తినడానికి ముందు ఆయా జంతువులను పరిశీలించారు. ఆ జంతువుల ఆహారపుటలవాట్లపైన దృష్టి పెట్టారు. అప్పుడు ఇది తినవచ్చు, ఇది తినగూడదని చెప్పారు. వాళ్ళ పరిశీలన, శ్రమ, త్యాగం ఎంత గొప్పవో! కోయలు, గోండులు, చెంచులు మొదలైన గిరిజన జాతులకున్న ప్రకృతి విజ్ఞానం ఎంతో గొప్పది. చెట్లను గురించి వాళ్ళకు తెలిసినంతగా ఎవరికీ తెలియదనడం అతిశయోక్తి కాదు. వాళ్ళు శాస్త్రజ్ఞులే. రోగాల బారిన పడినప్పుడు చెట్లమందులతోటే ఆరోగ్యాన్ని తిరిగి పొందారు. ఈ విషయాలలో గురువులై వారు తరవాతి తరాలకు తోవ చూపారు.

ఆదివాసులే కాదు, పల్లెతల్లి ఒడిలో బతికే జానపదుల జ్ఞానం కూడా తక్కువేమీ కాదు. పల్లెవారి పనితనాన్ని తెలిపేలా, వివరించేలా ఎన్నో పాటలు కూడా ప్రాచుర్యంలో ఉన్నాయి. గ్రామంలోని వివిధ పనులు, వృత్తులు చేసేవారు ఒకరిపై ఒకరు ఎలా ఆధారపడతారో వివరించే పల్లె పాటలు మనకు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. నిత్యం మనం వాడుకొనే ఒక వస్తువు అది కంచం కావచ్చు, మంచం కావచ్చు, టేబుల్ కావచ్చు. వీటిని తయారు చేయాలంటే వడ్రంగి, కమ్మరి, ఇతర పనివారు కృషి చేయాల్సి ఉంటుంది.


ఇలా వృత్తులన్నీ ఒకదానిమీద మరొకటి ఆధారపడి ఉంటాయని గుర్తించండి. అట్లే ఒక్క 'సోల' తయారుకావడానికి వెనక ఎందరు వృత్తిపనివాళ్ళ కష్టం దాగుందో ఆలోచించండి. ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉంటే తప్ప సమాజం సజావుగా సాగదు. ప్రతి వృత్తీ పవిత్రమైనదే. ప్రతి వృత్తిపనిలోనూ ఎంతో కష్టం,నైపుణ్యం, త్యాగం కలగలిసి ఉంటాయి. కాంతిని చూసి మురిసిపోతాం.కానీ ఆ కాంతినివ్వడానికి కరగిపోయే కొవ్వొత్తిని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తున్నామా?



ఎండాకాలం వచ్చిందంటే చాలు కుండలకు, కూజాలకు మహా గిరాకీ. అటికెలు, గురుగులు మన అవసరాలను తీరుస్తున్నాయి. భక్తి జీవితంలో భాగమైనవి ప్రమిదలు. ఇవన్నీ చకచకా ఎలా వచ్చేస్తున్నాయి? కుమ్మరి చక్రంనుంచి – బంకమట్టినుంచే. బంకమట్టి ఊరకే తయారవుతుందా? మెత్తటి మట్టి, బూడిద లేదా రంపపు పొట్టు, సన్న ఇసుకను కలిపి దీన్ని తయారుచేస్తారు. ఈ మూడింటిని కలిపి కాళ్ళతో బాగా తొక్కుతారు. చెమటోడ్చి సిద్ధంచేసిన ఈ బంకమట్టిని బండి చక్రంలాంటి సారెమీద పెడతారు. చక్రం మాత్రం ఊరకే తయారైందా? కమ్మరి, వడ్రంగి వాళ్ళ నైపుణ్యం కలగలిసి ఏర్పడింది. ఇందులో ఎంతో ఇంజనీరింగ్ నైపుణ్యం తొంగి చూస్తుంది. చక్రం తిరగడం కాదు. సమాజగతినే తిప్పేసింది. ఇదొక అద్భుత ఆవిష్కరణ.


చక్రం తిప్పుతూ చక్రంమీద పెట్టిన బంకమట్టిని చేతివేళ్ళ కొనలతో చాకచక్యంగా నొక్కుతారు. అత్యంత ఆశ్చర్యకరంగా, అనుకున్నరూపాలు అమాంతంగా వచ్చేస్తూంటాయి. ఆ చేతుల్లో ఇంద్రజాల విద్య ఉందా? అని అనిపించక మానదు. తయారైన మట్టిపాత్రలను ఆరబెడతారు. తరవాత 'కుమ్మర ఆము' లో పెట్టి బురదమట్టితో కప్పేస్తారు. దీనివల్ల కొలిమిని మండిస్తే అన్ని పాత్రలకూ ఆ వేడి అందుతుంది. పాత్రలన్నీ బాగా కాలి గట్టిగా తయారవుతాయి. మనం ఉపయోగించుకొనే మట్టిపాత్రలవెనక ఇంత తతంగముంది.

నగలంటే ఇష్టంలేనివాళ్ళెవరైనా ఉంటారా? మెడలో హారాలు, చేతులకు కడియాలు, గాజులు, చెవిలో కమ్మలు, ముక్కుపుడక, సిగబిళ్ళ, నడుముకు ఒడ్డాణం, కాళ్ళకు కడియాలు, గజ్జెలు, వేళ్ళకు ఉంగరాలు.... ఇలా ఎన్నెన్నో ఆభరణాలు ఆపాదమస్తకం ధరిస్తారు. ఒకప్పుడు ఏడు వారాల సొమ్ములు ధరించేవారట. ఆధునిక కాలంలో మరెన్నో రకాల వస్తువులు అందుబాటులోకి వచ్చాయి. ఒక్కొక్క ఆభరణాన్ని ఎన్నో రకాలుగా తీర్చిదిద్దుతారు. ముద్దగా ఉన్న బంగారాన్ని ముద్దుగా తీర్చిదిద్దడంలో ఎంత శ్రమ దాగి ఉందో తెలిస్తే ముక్కుమీద వేలువేసుకొంటాం. బంగారం అంత సులభంగా కరగదు. బంగారాన్ని మూసలో పెట్టి బొగ్గుల కొలిమిలో ఉంచి కరిగిస్తారు. నిప్పు రాజేయడానికి, నిప్పులు కణ కణలాడేలా మండడానికి బాగా ఊదాలి. బంగారం పనిచేసే వాళ్ళు (స్వర్ణకారులు) ఇలా ఊది ఊది అనారోగ్యపు బారినపడిన సందర్భాలు ఎన్నో.



బంగారమేకాదు మనం నిత్య జీవితంలో వాడే వెండి వస్తువుల తయారీలో కూడా ఎంతో కళాదృష్టి, నైపుణ్యం కనిపిస్తుంది. బంగారాన్ని, వెండిని వివిధ ఆకృతులుగా తీర్చి దిద్దడంలో గానీ, రత్నాలను పొదగడంలో


©SCERT not to be republished



గానీ సున్నితమైన పనితనం కనిపిస్తుంది. సన్నని వస్తువును తయారుచేసేటప్పుడు వాళ్ళ కళ్ళు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతాయి. అయినా మన కళ్లకు ఆనందాన్నిచ్చేలా ఆభరణాలను అందించడానికి శ్రమిస్తున్నారు.

ఇనుముతో నిత్యం సహవాసంచేసే కమ్మరులు తమ శ్రమను, నైపుణాన్ని సమాజంకోసం త్యాగం చేస్తున్నారు. ఇనుముతో వాళ్ళు చేసే నాగటి 'కర్రు' భూమిని దున్నడానికి ఉపయోగపడుతుంది. అలాగే పార, గొడ్డలి, గడ్డపార, కొడవలి, సుత్తి మొదలైనవి వ్యవసాయానికి చాలా అవసరమైన పనిముట్లు. వీటిని బండి చక్రపు (గిర్ర) పట్టాను కూడా వాళ్ళే తయారుచేసారు. ఇదొక గొప్ప ఇంజనీరింగ్ ప్రక్రియ. వీటన్నింటికీ ఉత్పత్తి కేంద్రం కమ్మరి కొలిమి. అది నిప్పులతో కణకణ మండుతూ ఉంటుంది. ఆ సెగను భరిస్తూ ఇనుమును కాల్చి సుత్తితో కావలసిన వస్తువుల రూపాలను తీర్చిదిద్దుతారు. ఇలా చేయడానికి చాలా కష్టపడవలసి ఉంటుంది.

ఇక వడ్రంగుల పనితనాన్ని ఒకసారి చూద్దాం. మనకు ఆహారం కావాలంటే భూమిని దున్నాల్సిందే. అందుకు ప్రధాన సాధనం నాగలి. దీన్ని రూపొందించేవాళ్ళు వడ్రంగులు. ఇదే కాదు గుంటక, గొర్రు వంటి పనిముట్లు కూడా వ్యవసాయంలో కీలకమైనవి. వీటిని తయారుచేయాలంటే ఏ చెట్టు కలప సరిపోతుందో పరిశీలిస్తారు. తాత ముత్తాతల కాలంలో వాళ్ళు ఎంతో పరిశోధించారు. కొయ్యను సరైన రూపాలలోకి తీసుకురావడం వెనక ఎంతో శ్రమ ఉంటుంది. చెట్టు కొట్టాలి, కొయ్యాలి, చెక్కాలి, దువ్వోడ(చిత్రిక)పట్టాలి, తొలికొట్టాలి, అందులో బిగించాలి... ఇలా ఎన్నెన్నో దశలు. వడ్రంగులు సమాజానికి అందించిన మరో సౌకర్యం బండి. ఇది వ్యవసాయానికే కాదు, ప్రయాణానికి కూడా పనికి వస్తుంది. అలాగే మొన్నమొన్నటివరకు ఇండ్లను కట్టె (కలప) తోనే నిర్మించేవారు. దూలాలు, వాసాలు, కిటికీలు, తలుపులు ఇవన్నీ వడ్రంగుల పనితనం మూలంగానే అందంగా, ఆకర్షణీయంగా తయారవుతాయి. మనం వాడుకొనే మంచాలు, కుర్చీలు, బెంచీలు, టేబుళ్ళు, అలమారలు....ఇలాంటివెన్నో వడ్రంగుల చేతుల్లో రూపొందినవే! అందుకే వాళ్ళను 'దారుశిల్పుల'ని అని అంటారు. ఇవన్నీ మనం డబ్బుతో కొనుక్కొంటే వస్తున్నాయని అనుకుంటాం ! అయితే వీటిని తయారు చేసినప్పుడే కదా ఎవరైనా



©SCERT not to be republished

కొనుక్కొనేది. ఇంటిసామగ్రి, వస్తుసామగ్రి, వ్యవసాయ సామగ్రి వంటివి చూస్తున్నప్పుడు వడ్రంగులను తలచుకోడం మన ధర్మం. వాళ్ళ నైపుణ్యాన్నీ గొప్పదనాన్నీ గౌరవించడం మన బాధ్యత.

తెల్లవారినప్పటినుంచి అడుగు బయటకు వేయాలంటే చెప్పుల్లో కాళ్లు పెట్టాల్సిందే. చెప్పుల చరిత్రను చెప్పుకొంటే ఆవేదన, ఆశ్చర్యం కలుగుతాయి. ఏదైనా జంతువు చనిపోతే దాన్ని చూసి దూరంగా వెళతాం. కాని తోలు పనివాళ్ళు ఆ జంతువు చర్మాన్ని ఒడుపుగా ఒలుస్తారు. శుభ్రం చేస్తారు. దానితోనే చెప్పులు తయారు చేస్తారు. ఒక వ్యర్థపదార్థంనుంచి అందరికీ ఉపయోగపడే వస్తువును సృష్టించినవారి తెలివి ఎంతో గొప్పది. అందుకు వాళ్ళు పడే శ్రమ ఎంతో విలువైనది. అసలు దీనికి వెల కట్టగలమా? వీరి ఔదార్యాన్ని చాటుతున్న ఈ పద్యం చదవండి.

**"ముప్పు ఘటించి వీని కులమున్, కలిమిన్ కబళించి దేహమున్**
**పిప్పి యొనర్చు నీ భరతవీరుని పాదము కందకుండగా**
**చెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లే**
**దెప్పుడు అప్పువడ్డది సుమీ భరతావని వీని సేవకున్."**

అని గుఱ్ఱం జాషువగారు నొక్కి వక్కాణించారు.

జంతుచర్మాన్ని అనేక రకాలుగా మలచడంలో వీరి ప్రతిభ కనిపిస్తుంది. చర్మంతో 'డప్పు' లాంటి వాద్యాలను తయారుచేశారు. ఇప్పటికీ ఊళ్ళలో ఏదైనా విషయం చాటింపు వేయాలంటే డప్పు కొట్టాల్సిందే. చివరకు మనిషిని కాటికి పంపడానికి కూడా డప్పే ముందుంటుంది. ఒకప్పుడు వ్యవసాయ బావిలోని నీటిని పైకి తోడడానికి పెద్ద బొక్కెనలుండేవి. వాటి తొండాలను కూడా చర్మంతో వీరే తయారుచేసేవారు.



సంఘంలో క్షురకుల సేవలు మరవరానివి. (క్షురమంటే కత్తి, తల వెంట్రుకలను కత్తిరించేవాడు క్షురకుడన్నమాట) ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో వారి భాగస్వామ్యం ఉంది. కత్తి, కత్తెరలతో వారు చూపే పనితనం నాణ్యమైనదే కాదు, సున్నితమైనది కూడా. క్షురకులకు తరతరాలుగా తెలిసిన మరొక విద్య దేశీయమైన వైద్యం. చెట్ల వేళ్ళతో, ఆకులతో, చేపలతో చేసే మందులను గురించికూడా వీళ్ళకు చక్కటి అవగాహన ఉంటుంది. పేను కొరకడం,


శరీరానికి గాట్లు పడడం వంటి సందర్భాలలో బయటపడే చిట్కాలు వీరి దగ్గర అనేకంగా ఉంటాయి. తైలంతో శరీరమర్దనం (మాలిష్) చేయడంలో గొప్ప నైపుణ్యంఉంటుంది. ఈ సేవలన్నీ చూడడానికి చిన్నవిగా అనిపించినా ఆరోగ్యకర సమాజానికి అవసరమైనవే.

శరీరాన్ని రక్షించుకోవాలంటే బట్టలు కావాలి. వాటిని బజారుకు వెళ్ళి కొని తెచ్చుకుంటున్నాం. కాని అవి తయారుకావడానికి పరిశ్రమిస్తారు నేతపనివారు. వాళ్ళు బట్టలు నేసే మగ్గాన్ని ఎప్పుడైనా చూశారా? దాని వెనుక ఎంతో సాంకేతిక పరిజ్ఞానం ఉంది. మగ్గంలో వాళ్ళు దారాలను ఏర్పరుచుకున్న తీరు, నేసేటప్పుడు వారు చూపే నైపుణ్యం ఇంతంతనరానివి. ఒకప్పుడు మన దేశంలో నేత పనివారు అగ్గిపెట్టెలో పట్టేటంత చీరను నేసినారంటే ఆశ్చర్యం గలగడం లేదూ? ఇదంతా ఆషామాషీ వ్యవహారం కాదు. పత్తినుంచి దారం తీయడం, రంగులద్దడం, అవసరమైన పద్ధతిలో గుడ్డను తయారుచేయడం... ఇదొక సుదీర్ఘ ప్రక్రియ.

గొర్రెల బొచ్చు కత్తిరించి ఉన్నిదారం వడికి దానితో గొంగడి (కంబళి)ని తయారుచేసే కురుమల శ్రమ ఎందరికో వెచ్చదనాన్ని కలిగిస్తున్నది. మురికి బట్టలను శుభ్రంచేసే రజకుల కాయకష్టం మనకు ఆరోగ్యాన్ని అందిస్తున్నది. శుభాశుభ కార్యక్రమాలు వీరి ప్రమేయం లేకుండా జరగవు.

ఈ వృత్తులవారందరూ చూపిన నైపుణ్యం తరవాతి కాలంలో అద్భుతమైన ఆవిష్కరణలకు దారి తీసింది. వీరి ఆలోచన, నైపుణ్యం ఎందరినో కదిలించింది. వీటిని ఆధారంగా చేసుకొని కొత్తవాటిని కనుక్కోవడానికి ప్రేరణ కలిగించింది.

ఒక్కరోజు ఆహారం లేకుంటే తల్లడిల్లుతాం. పిడికెడు మెతుకుల కోసం పడరాని పాట్లు పడేవాళ్ళెందరో



©SCERT not to be republished



ఉన్నారు. ఎవరేపని చేసినా కడుపునింపుకోడానికే. మనం తినే అన్నం, కూరగాయలు, పండ్లు వంటివేవీ సులువుగా వచ్చిపడేవికావు. చెమటోడ్చి పనిచేసిన రైతుల కృషి ఫలాలవి. ఎండనక, వాననక, రేయింబగళ్ళనక రెక్కలు ముక్కలు చేసుకొని రైతు శ్రమిస్తేనే మనం హాయిగా తినగలుగుతున్నాం. భారత దేశపు మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రిగారు 'జై జవాన్, జై కిసాన్' అన్న నినాదమిచ్చారు. సమాజానికి రైతు చేసే సేవ ఎంత గొప్పదో తెలుపుతున్న ఈ గేయాన్ని చదవండి.

© SCERT not to be republished

రైతే దేశానికి వెన్నెముక
అత దలిగితే లేదు మనకు అన్నమిక

కోటివిద్యలు అన్ని కూటికొరకన్నారు.
కూడుగోడును బాప రైతన్నలున్నారు.
నడుమొంచి కష్టించి పాడిపంటలు పెంచి
పొట్ట చల్లగుండంగ పోషించు అన్నదాత

తానేమొ పస్తులుండి తిండిపెడుతున్నాడు
సమాజ గమనానికి సాయపడుతున్నాడు
రాత్రనక పగలనక ఆత్రంగ పనిచేస్తూ
సోమరితనమొద్దని చాటిచెప్పే ధీరుడు

ఎండకు ఎండినా వానలో దడిసినా
చలిలో వణకినా సమస్యలతో నలిగినా
సడలని స్థైర్యంతో సస్యములనందిస్తూ
జాతిసేవలో పునీతుడై నిలచిన ॥ రైతే ॥



తెలిసిందిగా, రైతుల త్యాగం, కృషి ఎటువంటివో! ఇలా చూస్తూ పోతే ప్రతి ఒక్క వృత్తిలోనూ ఎంతో కొంత శ్రమ, నైపుణ్యం తొంగిచూస్తాయి. ప్రతి వృత్తీ పవిత్రమైనదే. దేన్నీ చిన్నచూపు చూడాల్సిన పని లేదు. ఎవరి ఇంట్లో శుభకార్యం జరగాల్సి ఉన్నా మంగళ వాద్యాలు , కుండలు, ప్రమిదలు, ఆభరణాలు, వస్త్రాలు మొదలయినవన్నీ కావాలి. అంటే ఇన్ని వృత్తులవారూ సహకరిస్తేనే ఏ కార్యాలైనా జరుగుతాయి. ఇలా అందరూ పరస్పరం సహకరించుకొంటేనే సమాజం నడుస్తుంది. అంతే కానీ 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లుగా ఉంటే సమాజ అభివృద్ధి కుంటుబడుతుంది. ఇందులో ఎక్కువతక్కువ తేడాలు మన మనస్సుల్లో ఉండగూడదు. శరీరంలో కళ్ళు, చెవి, ముక్కు, కాళ్ళు, చేతులు... వీటిలో ఏవి గొప్ప అంటే? అన్నీ కలసి ఉంటేనే శరీరం. అలాగే అందరూ కలసి ఉంటేనే సమాజం. ఒకప్పుడు గ్రామాలు స్వయంసమృద్ధంగా వెలిగాయి. గ్రామజీవనానికి అవసరమైన వస్తువులను అన్ని వృత్తులవారూ కలిసిమెలిసి తయారుచేసుకొనేవారు. ఒకరి అవసరాలకు మరొకరు చేదోడు వాదోడుగా నిలిచేవారు. కులాలను పక్కకు పెట్టి అక్క, బావ, మామ, అత్త, అన్న అని పిలుచుకొనే ఆత్మీయ సంబంధం వాళ్ళది. మానవత్వాన్ని చాటిన మధురజీవనం వాళ్ళది. కలిసి ఉండడం, ఒకరిమీద ఒకరు ఆధారపడడం, ఒకరికొకరు సహకరించుకోవడం, మన సంస్కృతిలోని గొప్ప విలువలు. వీటిని అలవరుచుకోవడం, పాటించడం, కాపాడుకోవడం మనందరి ధర్మం.

మనిషిని మనిషిగా గౌరవిద్దాం. అతనిలో దాగున్న ప్రతిభను అభినందిద్దాం. ఆ గొప్పదనాన్ని మనం అందుకోవడానికి ప్రయత్నిద్దాం.

"శ్రమ" పునాదిపైనే "అభివృద్ధి" భవనం ఆధారపడి ఉంటుంది. శ్రమించడానికి ఎవరూ సిగ్గుపడగూడదు. సోమరితనంతో శ్రమించకపోతేనే సిగ్గుపడాలి. శ్రమైక జీవన సౌందర్యాన్ని చూడగలగాలి. శ్రమను గౌరవంగా భావించడం నేర్చుకోవాలి. శ్రమ సంస్కృతిలో జీవించడం నేర్చుకోవాలి.

©SCERT not to be republished



## ఇవి చేయండి



1. 'ఆదివాసులు మనందరికీ మార్గదర్శకులు' దీన్ని వివరించండి.
2. కుమ్మరివారి గొప్పతనాన్ని గురించి వివరించండి.
3. "వడ్రంగివారు నేటి ఆధునిక ఇంజనీర్లు" – దీన్ని సమర్థిస్తూ పది వాక్యాలు రాయండి.
4. "రైతులు మన అన్నదాతలు" – వివరించండి.
5. "దేహానికి అవయవాలు ఎంత ముఖ్యమో, సమాజానికి అన్ని వృత్తులవాళ్ళూ అవసరం." దీన్ని సమర్థిస్తూ వ్యాసం రాయండి.
6. "ఒకరిమీద ఒకరు ఆధారపడడం" అనేది మన సంస్కృతిలో చాలా గొప్పది. ఎందుకు? దీన్ని వివరిస్తూ రాయండి.

కష్టించి పనిచేసి జయం పొందినవాడే విజయవంతమైన తన అనుభవ ఫలాలను ప్రపంచానికి అందించి దాన్ని సుసంపన్నం చేయగలడు. – డా॥ జగదీశ్ చంద్ర బోస్

# పదాలు - అర్థాలు

**అ**

అంఘ్రి - కాలు

అంచిత - ఒప్పిదమైన

అంతరిక్షం - ఆకాశం

అంపశయ్య - బాణాలతో తయారు చేసిన పడక.

అంభోధి - సముద్రం

అక్షౌహిణి - 21,870 రథాలు, 21,870 ఏనుగులు, 65,160 గుఱ్ఱాలు, 1,09,350 సైనికులు ఉన్న సైన్య విభాగం.

అగ్రిమెంటు - ఒప్పందం

అచ్చర - అప్సరస (దేవలోకపు స్త్రీ)

అడకించు (క్రి) - మోసంచేయు

అతిథి - తిథి మొ॥ కాలనియమం లేకుండా ఇంటికి భోజనానికి వచ్చేవాడు

అతృప్త - తృప్తిలేని

అద్రి - కొండ

అధికం - ఎక్కువ

అద్భుతంగా - చాల చక్కగా

అనంతరం - తరవాత

అనురక్తి - ఇష్టం

అపహాస్యం - ఎగతాళి

అప్సరోజనములు- అప్సరసలు

అపార - అంతులేని

అపార్థం - తప్పుడర్థం, మరో అర్థం

అభినందన - ప్రశంస, పొగడ్త

అభినందించు - పొగడు

అబ్ధి - సముద్రం

అభ్యాగతుడు - పిలుపులేకుండా వచ్చినవాడు (పర్వం, ఉత్సవం మొ॥న సమయాల్లో డబ్బు ఆశించి)

అభ్యున్నతి - అభివృద్ధి, మేలు

అమలుచేయు(క్రి) - ఆచరించడం

అమాంతంగా - ఒక్కసారిగా, ఉన్నపళాన

అరయు (క్రి) - చూడడం, వెతకడం, జాగ్రత్తగా గమనించడం

అరసిన - చూసిన

అర్జీ - పై అధికారులకు రాసే లేఖ, విన్నపం

అలమటించు(క్రి)- బాధపడడం

అల్లులు - ఆటలు

అవధానం - ఏకాగ్రత

అవని - భూమి

అవరోధం - అడ్డంకి, ఆటంకం

అవశ్యం - తప్పకుండా, తప్పనిసరిగా

అశ్వత్థామ - కృపి, ద్రోణుల కుమారుడు.

అశ్వమేధయాగం- ఒక రకం యాగం.

అసెంబ్లీ - శాసనసభ

**ఆ**

ఆంతర్యం - మనసులోని విషయం

ఆకాంక్ష - కోరిక

ఆకాశవాణి - రేడియో ప్రసారాల సంస్థ

ఆకృతి - ఆకారం

ఆచరణీయం - చేయదగినది

ఆటపట్టు - నిలయం, చోటు

ఆతురత - తొందర

ఆత్మజుడు - కొడుకు

ఆత్రం - ఆతురత, బలీయమైన కోరిక

ఆది - మొదలు

ఆదరం - గౌరవం

ఆదేశం - ఆజ్ఞ

ఆపద - కష్టం

ఆపళంగా - ఉన్నట్టుండి, ఒక్కసారిగా

ఆపాదమస్తకం - తలనుంచి కాళ్లవరకు

ఆప్తులు - ఇష్టమైనవారు

ఆబాలగోపాలం - పిల్లల దగ్గరినుంచి పెద్దల వరకు

ఆర్జన - సంపాదన

ఆర్జించు (క్రి) - సంపాదించడం

ఆలోచనీయం - ఆలోచించాల్సినది

ఆవళి / ఆళి - వరుస, పంక్తి, సమూహం

©SCERT not to be republished

ఆవాసం - ఇల్లు, నివాసం

ఆవిష్కరణ - బయల్పరచడం

ఆస్వాదించు (క్రి) - అనుభవించడం

ఆహ్లాదంగా - ఆనందంగా

**ఇ**

ఇంద్రజాలం - కనుకట్టు విద్య, గారడి

ఇకో- లొకేషన్ శక్తి - ప్రతిధ్వనులు / ప్రకంపనలు గమనించే శక్తి

ఇక్షురసం - చెరుకురసం

ఇగురొత్తు (క్రి) - చిగురించడం

ఇరవు - స్థానం

**ఈ**

ఈడు - వయస్సు

**ఉ**

ఉత్తరాయణం - సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన దగ్గరినుంచి ఆరు నెలల కాలం

ఉదరాగ్ని - కడుపులోని మంట, ఆకలి మంట

ఉల్లము - మనసు

ఉల్లసిల్లు (క్రి) - ప్రకాశించడం, వికసించడం, సంతోషించడం

**ఎ**

ఎడ - చోటు, స్థానం

ఎన - సమానం

ఎరవు - అప్పు

ఎలరుపు - సంతోషం

ఏమఱుచు (క్రి) - వంచించడం, మోసంచేయడం

ఏమఱుపాటు - పరధ్యానం

**ఒ**

ఒండుచోట - వేరొకచోట

ఒడిగట్టు - పూనుకొను

ఒడుపుగా - సున్నితంగా, జాగ్రత్తగా, నేర్పుగా

ఒదరు/ఒదడు (క్రి)- సంభ్రమించడం, తిరగడం, వెళ్ళడం

ఒనర్చు - చేయు

ఒప్పు - ప్రకాశించు

ఒలుకు (క్రి) - చిందడం, కిందపడటం

ఒసగు (క్రి) - ఇవ్వడం

ఓలి - వరుస

**క**

కంకి - వెన్ను

కంబము - స్తంభం

కజ్జము - భక్ష్యం, తినుబండారం

కడు - ఎక్కువ, చాలా

కదనం - యుద్ధం

కనుదోయి - రెండు కళ్ళు

కన్నుమూయు (క్రి)- మరణించడం

కపి - కోతి

కపిల - ఎరుపు కలిసిన గోధుమ వన్నెగల గోవు, ఒక జాతి ఆవు

కబళించు (క్రి) - ఆక్రమించడం

కర్మ - చేసినపని, చేసిన దానికి ఫలితం, పాపం

కలిమి - సంపద

కలుగు - రంధ్రం, బొరియ

కలుషం - మురికి, పాపం

కల్ల - అబద్ధం, అసత్యం

కష్టార్జితం - కష్టపడి సంపాదించినది

కసవు - మేత

కాంతులీను (క్రి) - వెలుగును బయలుపరచడం లేదా వెదజల్లడం

కాంపౌండ్ - ప్రహరీగోడ

కాక - వేడి

కామం - కోరిక

కాయకష్టం - శరీర శ్రమ

కాలక్షేపం - సమయాన్ని (వృథాగా) గడపడం

కికురువొడుచు (క్రి) - వంచించడం, మోసంచేయడం

కీర్తించు (క్రి) - పొగడటం

కుంగదీయు (క్రి) - బాధపెట్టడం

కుజనులు - చెడ్డవాళ్ళు

కుడుచు (క్రి) - తినడం, భుజించడం, (పొదుగు నుంచి) పాలు తాగడం

© SCERT not to be republished

| | | |
|---|---|---|
| కురుక్షేత్రం | - | కౌరవులూ, పాండవులూ యుద్ధం చేసిన ప్రదేశం. |
| కుఱుచ | - | పొట్టి |
| కులభూషణుడు | - | వంశం మొత్తానికి అలంకారం లాంటివాడు, గొప్పవాడు. |
| కుసుమం | - | పువ్వు |
| కూపీ | - | రహస్యం, గుట్టు |
| కృతజ్ఞత | - | చేసిన మేలును మరచిపోకుండా ఉండటం |
| కృతవర్మ | - | భోజదేశపు రాజు, దుర్యోధనుని స్నేహితుడు. |
| కృపీ | - | దయ |
| కృపుడు | - | కౌరవ పాండవులకు విలువిద్య నేర్పిన మొదటి గురువు. |
| కేబుల్ గ్రాం | - | విదేశాలకు పంపే టెలిగ్రాం |
| కేశపాశం | - | తల వెంట్రుకల కొప్పు |
| కొంకు | - | సందేహం |
| కొమరు | - | అందం |
| కొరగాని | - | అక్కరకురాని |
| కౌతుకం | - | కుతూహలం |
| క్రేపు | - | దూడ |
| క్రోడీకరించు(క్రి) | - | ఒకచోటికి చేర్చడం |
| క్రోధం | - | కోపం |
| క్రౌర్యం | - | క్రూరత్వం, ఇతరులను, బాధపెట్టే గుణం |
| క్షాత్రం | - | క్షత్రియధర్మం, వీరత్వం |

**గ**

| | | |
|---|---|---|
| గంగడోలు | - | ఆవుమెడకింద వేలాడుతుండే చర్మం |
| గగనం | - | ఆకాశం |
| గర్భం | - | పొట్ట, కడుపు |
| గజం | - | ఏనుగు |
| గహ్వరం | - | గుహ |
| గారవం | - | గౌరవం |
| గున్న ఏనుగు | - | చిన్న / పిల్ల ఏనుగు |
| గుమ్మ | - | పాలు పిండేటప్పుడు వచ్చే ధార |
| గురిగి | - | మట్టితోచేసిన చిట్టి పాత్ర (కుండ) |
| గురు | - | పెద్ద, గొప్ప |
| గొషన్ (గొచన) | - | గలీబు; దిండ్లకు బొంతలకు వేసేతొడుగు |

**ఘ**

| | | |
|---|---|---|
| ఘటించు | - | కలగజేయు |
| ఘట్టం | - | సంఘటన, సన్నివేశం |
| ఘన | - | గొప్పదైన |
| ఘనకార్యం | - | గొప్ప పని |

**చ**

| | | |
|---|---|---|
| చండిమ | - | వాడిమి, |
| చక్రవర్తి | - | రాజులకు రాజు |
| చతురత్వం | - | చాతుర్యం, నేర్పు |
| చనుదెంచు | - | వచ్చు |
| చయ్యన | - | వెంటనే |
| చిందు (క్రి.) | - | ఒలకడం |
| చిత్తవిస్ఫూర్తి | - | మనోవికాసం |
| చిరజీవత్వం | - | ఎప్పుడూ ఉండటం |
| చివురు | - | లేత |
| చీటి | - | ఉత్తరం |
| చెండాడు (క్రి) | - | కొట్టడం / బాధించడం |
| చెంత | - | దగ్గర |
| చెర | - | ఖైదు, జైలు |
| చెలమ | - | ఎండిపోయిన వాగు, నది మొదలయినవాటిలో నీటికోసం చేసిన గొయ్యి |
| చెలువము | - | అందం |
| చేతము | - | మనసు |
| చేదోడు వాదోడు | - | చేతిసాయం, మాటసాయం |
| చేవ | - | శక్తి / బలం; చెట్టుమాను లో సారవంతమైన పదార్థం |
| ఛాయ | - | నీడ |
| ఛారిటీ షో | - | ఒక మంచి పనికి సహాయపడటానికి డబ్బుకొరకు ఇచ్చే ప్రదర్శన |

**జ**

| | | |
|---|---|---|
| జనపదం | - | పల్లెటూరు |
| జనిత | - | పుట్టిన |
| జాగిలం | - | వేటకుక్క |

© SCERT not to be republished

[illegible]యు (క్రి) - ఇవ్వడం

జాలువారు (క్రి) - ప్రవహించడం, కిందికి జారడం

జీవగడ్డ - చైతన్యంతో తొణికిసలాడుతున్న భూమి

జుంటీగలు - తేనెటీగలు

జ్ఞానేంద్రియాలు - కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం

## ట

టూకీగా - సంగ్రహంగా, సంక్షిప్తంగా

## త

తటాలున - ఒక్కసారిగా

తతంగం - ప్రక్రియ

తద్ద (యు) - అత్యంతం, ఎక్కువగా

తనరు - ఒప్పు, ప్రకాశించు, అతిశయించు, విజృంభించు

తనువు - శరీరం

తరంగం - అల / ధ్వని ప్రయాణం చేసే మార్గం

తరంగితం - అలలతో కూడినది

తలగడ - దిండు, తలకింది మెత్త

తలపు - ఆలోచన

తలము - పైభాగం

తల్లడిల్లు (క్రి) - బాధపడటం

తామసభావం - తమోగుణం; సోమరితనం మొ॥న లక్షణాలు

తార్కాణం - ఉదాహరణం, నిదర్శనం, రుజువు

తాల్మి - ఓర్పు

తిలకించు (క్రి) - చూడటం

తురుము (క్రి) - కొబ్బరి మొ॥న వాటిని సన్నగా గీకడం, పొడిగాచేయడం, తలలో పూలు మొ॥నవి పెట్టుకోడం

తెలిఱాయి - తెల్లరాయి

తెలుగునాడు - తెలుగునేల

తెల్లబోవు (క్రి) - ఆశ్చర్యపోవడం

తేజరిల్లు (క్రి) - ప్రకాశించడం

తోరము - అధికమైన, దట్టమైన, సాంద్రమైన

త్రచ్చు (క్రి) - మథించడం, చిలకడం

[illegible]ళ్ళు (క్రి) - పడటం

త్రోపాడు (క్రి) - తోయడం, తోసుకోడం

## ద

దంపతులు - భార్యాభర్తలు, ఆలుమగలు

దరహాసం - చిరునవ్వు

దారువు - కఱ్ఱ

దినకృత్యం - రోజూచేసే పని

దివ్యలోకం - దేవలోకం

దీప్తి - కాంతి

దురంతం - పెద్ద, చేయరాని, చేయకూడని

దురితం - పాపం

దురితదూర! - పాపాలను పోగొట్టేవాడా!

దైత్యులు - రాక్షసులు, దితి కుమారులు

ధరిత్రి - భూమి

ధీ - బుద్ధి

ధీ జడిమ - బుద్ధికున్న మందగొడితనం

ధీరుడు - ధైర్యవంతుడు

ధేనువు - ఆవు, గోవు

## న

నక్కి ఉండు (క్రి) - దాక్కొని ఉండటం

నయనాంచలం - కంటికొన

నల్గడలు - నాలుగు దిక్కులు

నిక్కము - నిజం

నిజావాసం - స్వస్థలం

నిర్విరామంగా - విశ్రాంతి లేకుండా

నిర్జీవంగా - ప్రాణం లేకుండా

నిశితం - చురుకైన

నృపుడు - రాజు

న్యూస్ పేపర్ - వార్తాపత్రిక

## ప

పక్కాగా - కచ్చితంగా

పజ్జ - దగ్గర, వెనక

పట్టాభిషేకం - కొత్తగా రాజును ఎన్నుకొన్నప్పుడు అతనికి ఆనవాయితీగా చేసే ఉత్సవం

పట్టి - సంతానం (కొడుకు / కూతురు)

పడతి, పడంతి - స్త్రీ

© SCERT not to be republished

| | | |
|---|---|---|
| పథం | - | మార్గం |
| పన్నిదము | - | పందెం |
| పరబ్రహ్మ | - | భగవంతుడు, దేవుడు |
| పరారీ | - | పారిపోయినవాడు |
| పరితృప్తి | - | సంతోషం |
| పరిమళం | - | సువాసన |
| పరిమాణం | - | కొలత |
| పరివృద్ధి | - | అభివృద్ధి |
| పల్లం | - | దిగువ ప్రాంతం, ప్రదేశం |
| పసిగట్టు (క్రి) | - | వాసనద్వారా గుర్తించడం |
| పాదపరాగం | - | కాలిదుమ్ము, పాదధూళి |
| పాదు | - | మూలం |
| పారావారం | - | సముద్రం |
| పాఱు (క్రి) | - | ప్రవహించడం, పరుగెత్తడం. |
| పాషాణం | - | రాయి |
| పుండరీకం | - | పులి, వ్యాఘ్రం |
| పుత్తడి | - | బంగారం |
| పునీతులు | - | పవిత్రమైనవాళ్ళు |
| పూరి | - | గడ్డి |
| పుష్కలం | - | ఎక్కువ |
| పైడి | - | బంగారం |
| పొడుచు (క్రి) | - | పైకివేయడం |
| పోలు (క్రి) | - | ఒప్పడం, తగి ఉండడం. |
| ప్రకంపన | - | కదలిక |
| ప్రజ్ఞ | - | తెలివి, నేర్పు, ప్రతిభ. |
| ప్రత్యక్షంగా | - | కంటికి ఎదురుగా |
| ప్రతిమ | - | విగ్రహం |
| ప్రమేయం | - | అవసరం |
| ప్రల్లదము | - | అబద్ధం |
| ప్రవేశించు (క్రి) | - | లోపలికి వెళ్ళడం |
| ప్రాచీన | - | పూర్వకాలానికి సంబంధించిన |
| ప్రాప్తించు (క్రి) | - | కలగడం, రావడం |
| ప్రాయశ్చిత్తం | - | పాపం పోవడంకోసం చేసే పని |
| ప్లే గ్రౌండ్ | - | ఆటస్థలం |
| ఫణి | - | పాము |

## బ

| | | |
|---|---|---|
| బంధుర | - | దట్టమయిన, తగిన |
| బడబానలం | - | సముద్రంలోని అగ్ని |
| బహుళ | - | అనేక రకాల |
| బాదరాయణుడు | - | వ్యాసుడు |
| బాలభానుడు | - | ఉదయిస్తున్న సూర్యుడు |
| బాసాడు (క్రి) | - | ప్రమాణం చేయడం |
| బీజం | - | విత్తనం |
| బుధులు | - | పండితులు |
| బేల్పరచి | - | మోసంచేసి |
| బోధించు (క్రి) | - | చెప్పడం |
| భంగము | - | అల, కెరటం |
| భయద | - | భయం కలిగించే |
| భాషణం | - | మాట |
| భీతి | - | భయం, బెదురు |
| భువి | - | భూమి, స్థానం |
| భూతకోటి | - | ప్రాణికోటి, ప్రాణుల సమూహం |
| భూప సభ | - | రాజసభ |
| భ్రమ | - | భ్రాంతి; లేనిది ఉన్నట్లుగా తోచడం |

## మ

| | | |
|---|---|---|
| మంజరి | - | గుత్తి, సమూహం |
| మకాం | - | నివాసం, బస |
| మగిడివచ్చు (క్రి) | - | తిరిగిరావడం |
| మణులు | - | రత్నాలు |
| మథనపడు (క్రి) | - | సతమతం కావడం |
| మదం | - | కొవ్వు; ఏనుగు కుంభస్థలం నుండి కారే ద్రవం; గర్వం. |
| మధురం | - | తీయనైనది |
| మధువు | - | తేనె |
| మమత్వం | - | 'నాది' అనే ఆలోచన, మోహం. |
| మహత్కార్యం | - | గొప్పపని |
| మహత్తర | - | గొప్ప |
| మహనీయుడు | - | గొప్పవాడు |
| మహీజం | - | చెట్టు |
| మానం | - | శీలం, గౌరవం |
| మార్గం | - | దారి |

©SCERT not to be republished

మిట్టు (క్రి) - ఎగరడం
ముగ్ధులు - సంతోషించినవాళ్ళు
ముచ్చటగా - ముద్దుగా, చక్కగా
మునుపడగా - ముందుగా
ముమ్మరంగా - ఎక్కువగా
మెఱుగు - తళతళలాడే కాంతి
మేలు - మంచి, ఉపకారం
మైత్రి - స్నేహం
మొనయు (క్రి) - పూనడం, చేయడం
మొఱఁగికొని - నక్కి, దాక్కొని.
మొఱయు (క్రి) - మోగడం
మౌఖికం - ముఖం నుంచి వెలువడినది, మాట, పాట వంటివి
మ్యాగజైన్ - నిర్ణీత కాలవ్యవధిలో వచ్చే పత్రిక

### య

యశము - కీర్తి

### ర

రవము - అరుపు, ధ్వని.
రసాభాస - రసభంగం
రాజనాలు - ఒక రకమైన మేలిరకపు ధాన్యం
రాజసభావం - రజోగుణం; కోపం మొ॥న లక్షణాలు
ఱాలు - రాళ్ళు
రెమ్మ - పెద్ద కొమ్మకుండే చిన్న కొమ్మ
రేయి - రాత్రి

### ల

లతిక - తీగ
లవణం - ఉప్పు
లసత్ - ప్రకాశించే
లెస్స - బాగా ఉన్నది
లోభి - పిసినారి

### వ

వనం - అడవి
వరహా - ఒకప్పటి వాడుకలోని డబ్బు, ఒక నాణెం
వరలుట - వర్ధిల్లుట
వల్లరి - తీగ
వల్లవుఁడు - యాదవుడు, వంటవాడు.
వల్లెవేయించు - మళ్లీ మళ్లీ చెప్పించు
వసుధ - భూమి, అవని
వాంఛ - కోరిక
వాక్కు - మాట
వాటి - తోట
వాటి(క) - ప్రదేశం
వార్త - సమాచారం
వార్తకెక్కు (క్రి) - ప్రచారాన్ని పొందడం
వాస్తవం - నిజం
వికలం - విరగడం, కలత
విమల - స్వచ్ఛమైన
వ్యాఘ్రం - పులి, పుండరీకం.
వ్రాలు - సంతకం
వితరణి - దానశీలి
విత్తం - ధనం
విద్వాంసుడు - పండితుడు
విధాతృడు, విధాత - బ్రహ్మ
వినాశం - నాశనం
వినిర్గతం - బయలు వెడలినది
విపినం - అడవి
విపుల - విస్తరించిన
విప్లవం - విశేషమైన మార్పు
విభిన్న - వేరు వేరు
విమల - పవిత్రమైన, నిర్మలమయిన
విరాళం - చందా
విలసితము - ప్రకాశితం, పెంపొందింపజేసినది,
విలసిల్లు (క్రి) - పెంపొందు, ప్రకాశించు
విశదంచేయు (క్రి) - వివరించడం
విస్తరించు (క్రి) - వ్యాపించడం
వీనులవిందు - చెవులకింపు కలిగించేది
వృద్ధులు - ముసలివారు
వృషము - ఎద్దు, వృషభం
వేదశాఖలు - నాలుగు వేదాలు, వేదాలలోని శాఖలు

© SCERT not to be republished

శ

శపథం - ప్రమాణం, ఒట్టు

శార్దూలం - పులి

శాశ్వతుడు - ఎప్పుడూ ఉండేవాడు

శిలాతటి - పెద్దపెద్ద రాళ్లున్న ప్రదేశం

శిల్పవిద్యానిధి - శిల్పవిద్యలో ఆరితేరినవాడు

శిల్పికంఠీరవా! - శిల్పులలో గొప్పవాడా!

శౌర్యచండిమ - పరాక్రమతీవ్రత

శోకం - ఏడుపు, రోదన

శ్రీలు - సంపదలు

శ్రుతులు - వేదాలు

శ్రేణి - వరస

శ్రేష్ఠం - ఉత్తమం, గొప్పది

ష

షరతు - నియమం, నిబంధన

స

సంక్షేమం - మేలు, మంచికోసం చేసే సహాయం

సంకేతం - గుర్తు, చిహ్నం

సంగ్రామం - యుద్ధం

సంస్తవనీయుడు - పొగడదగినవాడు

సంశయం - సందేహం

సఖులు - స్నేహితులు, చెలికత్తెలు

సజ్జనులు - మంచివారు

సత్యసూక్తి - మంచిమాట

సత్వరం - వెంటనే

సదృశం - సమానం, తగినది.

సదా - ఎప్పుడూ

సమరం - యుద్ధం

సమష్టి - సమస్తం, మొత్తం

సమీపం - దగ్గర

సమృద్ధి - నిండుగా ఉండడం

సమ్మోదము - సంతోషం

సాత్యకి - శ్రీకృష్ణుని స్నేహితుడు, వృష్ణివంశ యోధుడు.

సాధువాదములు - మెచ్చుకోలు మాటలు, ప్రశంసలు

సాయుధ దళాలు - ఆయుధాలు ధరించిన సైనికుల బృందాలు

సావధానంగా - ఏకాగ్రతతో

స్నిగ్ధ - మచ్చలేని, స్వచ్ఛంగా ఉన్న

సీమ - ప్రదేశం, హద్దు, ఎల్ల

స్వీకరించు (క్రి) - తీసుకోవడం

సుగమం - సులభంగా తెలిసేది, లేదా వెళ్ళగలిగినది

సుగుణం - మంచి స్వభావం, లేదా లక్షణం

సునామి - పెద్ద ఉప్పెన

సుభటకోటి - గొప్పసేన

సుభాషిణి - చక్కగా మాట్లాడేది

సుభిక్షం - కరువు కాటకాలు లేకుండా ఉండటం

సురభి - కామధేనువు

సురులు - దేవతలు

సెగ - మంట ఇచ్చే వేడి

సేవించు (క్రి) - సేవచేయడం

సోగకన్నులు - పొడుగాటి కన్నులు

స్థితప్రజ్ఞుడు - స్థిరమైన మంచిబుద్ధి గలవాడు

స్నిగ్ధం - సుకుమారం

హ

హరిత్తు - సింహం

హర్షం - ఆనందం

హాని - కీడు, చెడు

హితైషిణి - మేలుకోరేది / శ్రేయోభిలాషిణి

హేతువు - కారణం

© SCERT not to be republished